క్లుప్తంగా

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



తూర్పుపాలెంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెంలో శనివారం ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సమక్షంలో స్థానిక టీడీపీ, జనసేనకు చెందిన పలువురు కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ మేరకు రాపాక సూర్య ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సీఎంగా మరోసారి జగనన్నను గెలుపించేలా పనిచేయాలని ఆయన సూచించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల బ్రహ్మాజీ, ఎంపీటీసీ ఒగ్గు సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాంబాబు, సీసీఎఫ్ సొసైటీ అధ్యక్షుడు నల్లి సత్యం, నాయకులు చింతా రాజబాబు, కె.అశోక్, బత్తుల సంజీవరావు, రాజారావు, తాడి శ్రీను పాల్గొన్నారు.

రక్త పింజర్ల కలకలం



గోగన్నమఠంలో కొట్టి చంపిన రక్త పింజర

మామిడికుదురు: గోగన్నమఠంలోని పల్లిపాలెం వాసులను రక్తపింజర్లు కలవర పెడుతున్నాయి. మూడు రోజుల వ్యవధిలో మూడు రక్త పింజర్లు స్థానికుల కంట పడ్డాయి. వాటిలో రెండింటిని స్థానికులు కొట్టి చంపారు. మరొకటి తప్పించుకుందని వాపోయారు. ఈ రక్త పింజర్లు అయిదడుగులు పైబడి పొడవున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం రక్త పింజర కాటుకు గురైన శేరు నాగవేణి రాజోలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొంది శనివారం క్షేమంగా ఇంటికి చేరుకుంది. గతంలో ఇదే ప్రాంతానికి చెందిన ఒక మహిళ రక్త పింజర కాటుకు గురై మృతి చెందిందని పల్లిపాలెం వాసులు పేర్కొన్నారు. ఇటీవల తమ ప్రాంతంలో రక్త పింజర్ల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు శాకంబరిగా గుర్రాలక్క

సఖినేటిపల్లి: అంతర్వేదిలో కొలువైన గుర్రాలక్క అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ శనివారం చెప్పారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారికి ఉదయం అర్చకులు శాకంబరి అలంకరణ చేయనున్నట్టు, శాకంబరిగా అమ్మవారిని భక్తులు దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు తీసుకోవాలని ఆయన కోరారు.

యూనిఫాం పంపిణీ

అయినవిల్లి: ముక్తేశ్వరం నరహరిశెట్టి వెంకట్రావు ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం శనివారం ఉచిత యూనిఫాం పంపిణీ చేసింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవవరపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. కళాశాల అధ్యాపక సిబ్బంది బి.రఘు, పి.వెంకట్రావు, జీవీవీ రమణమూర్తి, కె.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి నాగశ్రీజ ఎంపిక



బి.లక్ష్మీ నాగశ్రీజ

సఖినేటిపల్లి: మోరి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ని బి.లక్ష్మీ నాగశ్రీజ శ్రీకాకుళంలో ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించినట్టు పాఠశాల హెచ్ఎం శ్రీధర్ కృష్ణ శనివారం తెలిపారు. పది ఫలితాల్లో శ్రీజ 569 మార్కులు సాధించి మండలంలో తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. శ్రీజ తల్లిదండ్రులు బి.సత్తిబాబు, సూర్యకుమారి చేనేత వృత్తిలో ఉన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలన్నది శ్రీజ ఆశయం. ఆమెను గ్రామపెద్దలు, అధికారులు అభినందించారు.

గ్రామీణ విత్తనోత్పత్తిపై అవగాహన

అయినవిల్లి: మండలంలోని మాగాంలో గ్రామీణ విత్తనోత్పత్తిపై జిల్లా వ్యవసాయ సహాయకుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. రాజశేఖర్ 50 శాతం రాయితీపై ఫౌండేషన్ ప్రభుత్వం వరి విత్తనాలు సరఫరా చేస్తున్నామన్నారు. ఎరువుల యాజమాన్యం వంటివి వివరించారు. ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతిర్మయి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వై.శోభ, రైతు నాయకులు పాల్గొన్నారు.



ఊడిమూడిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్



జి.అగ్రహారంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

సంక్షేమం చేరువ చేసేందుకే జగనన్న సురక్ష



రామేశ్వరం జగనన్న సురక్ష సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

- ఎమ్మెల్యే రాపాక
- అర్హులకు ధ్రువపత్రాల పంపిణీ

సఖినేటిపల్లి: అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను మరింత చేరువ చేసేందుకే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం రామేశ్వరంలో జగనన్న సురక్ష క్యాంపును ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. క్యాంపులో ఎంపీడీవో జి.భీమారావు, తహసీల్దారు వై.రామకుమారి ఆధ్వర్యంలో సిద్ధం చేసిన ఆదాయ, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హత ఉన్న ఏ ఒక్కరూ కూడా పథకాలకు దూరం కాకూడదన్న ఏకైక లక్ష్యంతో ఈ కార్యక్రమం గ్రామ గ్రామాన నిర్దేశించిన ముందస్తు షెడ్యూల్ ప్రకారం అధికారులు నిర్వహిస్తున్నారన్నారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, వైఎస్ ఎంపీపీ రాపాక దీవెనకుమారి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ దొండపాటి సునీత, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామశాఖ అధ్యక్షుడు లక్ష్మణ్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: పేదలందరికీ పథకాల లబ్ధి అందించాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్య మోహన్ అన్నారు. గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల్లోని సచివాలయాల వద్ద ఎంపీడీఓ కె.సత్యనారాయణ, తహసీల్దార్ టి.మంగతాయారుల పర్యవేక్షణలో సర్పంచ్‌లు కాండ్రేగుల శ్రీనివాసరావు, దొంగ నాగేశ్వరరావుల అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గంగలకుర్రులో 1313, గంగలకుర్రు అగ్రహారంలో 1356 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నెల్లి పండు, విత్తనాల దుర్గాభవాని, ముత్తాబత్తుల ప్రశాంత్, రాయుడు షణ్ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: జగనన్న సురక్ష ద్వారా సంక్షేమ పథకాలకు అవసరమైన సర్టిఫికెట్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ ఎం.భారతి అన్నారు. మండలంలోని ఊడిమూడి-1, ఊడిమూడి-2 గ్రామ సచివాలయాల్లో శనివారం సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్న కుమార్ అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్షలో 6400 సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డీటీ బి.గోపాలకృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, కన్వీనర్లు సాధనాల రమేష్, నేలపూడి గంగరాజు, కడలి వెర్రియ్య, మేడిశెట్టి శివ గంగేశ్వరి, కొల్లి వెంకటలక్ష్మి, ఈఓ అండ్ పీఆర్డీ శరభరాజు, ఆర్ఐ తులసీరావు, ఆదిమూలం సూరయ్యకాపు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

అయినవిల్లి: నేదునూరు-2, శానపల్లిలంక సచివాలయ పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామాల్లో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. సర్పంచులు పంబలకుమారి, గుమ్మడి ప్రసాద్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. గ్రామంలో పలువురు సమస్యలు తీసుకొచ్చారు. పింఛన్ల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పచ్చిమాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

హైదరాబాద్ వెళ్లి.. పింఛన్ అందించి..



హైదరాబాదు వెళ్లి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ ములపర్తి వెంకటరమణ

పాశర్లపూడికి చెందిన మల్లవరపు భువనచంద్ర గత కొంత కాలం నుంచి మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. అతడిని హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో ఉంచి వైద్యం చేయిస్తున్నారు. అతడి ఇబ్బందులు తెలుసుకున్న వలంటీర్ ములపర్తి వెంకటరమణ రెండు నెలల నుంచి హైదరాబాద్ వెళ్లి పింఛన్ ఇచ్చి వస్తున్నాడు. తద్వారా భువనచంద్ర కుటుంబానికి వలంటీర్ వెంకటరమణ ఎంతో ఆత్మీయుడిగా నిలిచాడు.

మాకు రేషన్ కార్డు వచ్చింది



పిల్లి సుధాకర్, రమ్య దంపతులు

మా గ్రామ వలంటీర్ కోళ్ల సురేష్ వల్లే మాకు రేషన్ కార్డు వచ్చిందని బి.దొడ్డవరం గ్రామానికి చెందిన పిల్లి సుధాకర్, రమ్యలు పేర్కొన్నారు. నాలుగేళ్ల క్రితం పెళ్లయిందన్నారు. కొత్త రేషన్ కార్డు కోసం ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. చివరకు వలంటీర్ సురేష్ వల్ల ఏడాది క్రితం తమకు కొత్త రేషన్‌కార్డు మంజూరైందని చెప్పారు. వలంటీర్ లేకపోతే మాకు రేషన్‌కార్డు వచ్చేది కాదన్నారు.

కరోనా కష్టకాలంలో అండగా..



కరోనా సమయంలో నన్ను ఎవరూ పట్టించుకోలేదు. ఒంటరిగానే ఇంటిలో ఉన్నాను. మా వలంటీర్ మంచాల జ్యోతి నా పరిస్థితి తెలుసుకుని కరోనాను కూడా లెక్క చేయకుండా మా ఇంటికి వచ్చి సేవలందించింది. అంతేకాకుండా మనోధైర్యం కల్పించి కావాల్సిన మందులు, ఇతర వస్తువులు ఇంటికి తీసుకువచ్చి ఇచ్చేది. నాకు గతంలో రేషన్‌కార్డు కూడా లేదు. ఈ విషయాన్ని వలంటీర్ తెలుసుకుని నాకు తెల్లరేషన్ కార్డు ఇప్పించింది. రేషన్ కార్డు వచ్చిన వెంటనే ఈ బీసీ, పింఛను కూడా వలంటీర్ ద్వారా వచ్చింది.

– పెద్దింటి కుమారి సుశీల, చిరతపూడి

పథకాలు అందిస్తూ.. అండగా ఉంటూ..



ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలను వివరిస్తూ.. కావాల్సినవి చేసి పెడుతూ వలంటీర్ అండగా ఉంటున్నారు. నాకు, నా భర్తకు కరోనా వస్తే ఎవరూ దరి చేరలేదు. మా వలంటీర్ కొంబత్తుల శాంతకుమారి ఇంటికి వచ్చి వైద్య సేవలతో పాటు కావాల్సిన సరకులను అందజేసి కంటికి రెప్పలా చూసుకుంది. మాకు వచ్చే సంక్షేమ పథకాలను వివరించి తానే చేయించింది. డాక్టర్ వైఎస్సార్ చేయూత, ఆసరా పథకం, నా భర్తకు వృద్ధాప్య పింఛన్ వలంటీర్ వల్లే వచ్చింది. వలంటీర్ల సేవలకు వెలకట్టలేము.

– పిల్లి దుర్గ, చిరతపూడి

పథకాలు కొనసాగాలంటే జగన్‌కు అండగా నిలవాలి

మలికిపురం: రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే సీఎం జగన్‌కు అండగా నిలవాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం తూర్పుపాలెంలో ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. స్థానికులను ఆత్మీయంగా పలకరిస్తూ వారి చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు తోడుగా నిలవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల బ్రహ్మాజీ, ఎంపీటీసీ ఒగ్గు వెంకట సుబ్బారావు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాంబాబు, సీసీఎఫ్ సొసైటీ అధ్యక్షుడు నల్లి సత్యం, నాయకులు చింతా రాజబాబు, యెనుముల నారాయణస్వామి, కొల్లాబత్తుల అశోక్, ఆకుమర్తి ప్రకాష్, గంటా ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.



తూర్పుపాలెంలో మహిళకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

భక్తులకు ఉచితంగా వైద్య సేవలు



ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో అమలాపురానికి చెందిన మెడ్ యునైటెడ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు జాయ్‌సన్ మానుకొండ, వైదేహి మనుకుట్ల భక్తులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, గైనకాలజిస్ట్, యూరాలజీ, న్యూరాలజీ, పీడియాట్రిక్స్ సమస్యలకు పరీక్షలు చేశారు. అప్పనపల్లి ఆలయం వద్ద ప్రతి శనివారం ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు ఐ.శివకుమార్, పీఆర్వో పవన్‌కుమార్ కోరారు.

ఆర్థిక సాయం పంపిణీ

అంబాజీపేట: మాచవరం శివారు పోతాయిలంక తాటికాయల చెరువుకు చెందిన ఒంటరి మహిళ కుసుమ శాంతకుమారి అనారోగ్యంతో బాధపడుతుండటంతో బీఎస్పీ ఆధ్వర్యంలో శనివారం సాయం పంపిణీ చేశారు. బత్తుల మీరాసాహెబ్, వెంకట నర్సమ్మ కుటుంబ సభ్యులు సమకూర్చిన బియ్యం, నిత్యావసరాలను బీఎస్పీ రాజోలు నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుమర్తి భూషణం ఆధ్వర్యంలో శాంతకుమారికి పంపిణీ చేశారు. స్థానిక బెరక చర్చి సంఘస్తులు రూ.30 వేలు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నెల్లి బాలశేఖర్ రూ.10 వేల నగదు ఆమెకు అందజేశారన్నారు.



శాంతకుమారికి నిత్యావసరాలు అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

కాలువగట్టు రోడ్డు అభివృద్ధి కోరుతూ వినతి



కాలువగట్టు రోడ్డును అభివృద్ధి చేయాలని వినతిపత్రం ఇస్తున్న కాలనీల వాసులు

మామిడికుదురు: అధ్వానంగా మారిన మామిడికుదురు–లూటుకుర్రు కాలవగట్టు రోడ్డు అభివృద్ధి చేయాలని కోరుతూ గన్నేరుపుంత, ఎస్‌జీఆర్ కాలనీ వాసులు శనివారం పంచాయతీ కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. కాలువ గట్టు రోడ్డు చాలా అధ్వానంగా మారిందని వాపోయారు.

తమ ప్రాంతాల నుంచి పాఠశాలకు వెళ్లే విద్యార్థులు నిత్యం యాతన పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి పాడైన రోడ్డును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ముగ్గ తులసీరావు, రామేశ్వరపు వీరబాబు, ఇంగువ వరలక్ష్మి, లంక రాజశేఖర్, కనపాల దుర్గ, కనపాల రమణ తదితరులు ఉన్నారు.

సబ్సిడీపై గడ్డి విత్తనాల పంపిణీ

అంబాజీపేట: పశువుల దాణా కోసం పాడి రైతులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. మొక్కజొన్న, జొన్న, అలసంద విత్తనాలను 75 శాతం రాయితీపై పాడి రైతులకు ఇవ్వనున్నామన్నారు. ఈ మూడు రకాల విత్తనాలు అర టన్ను చొప్పున పశువైద్య కేంద్రానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. రైతులు తమ వాటాగా రూ.25 శాతం చెల్లిస్తే సరిపోతుందన్నారు. 5 కేజీల బ్యాగ్‌ల వారీగా జొన్న రూ.115, మొక్కజొన్న రూ.85, 3 కేజీల అలసందకు రూ.75 చొప్పున రైతులు చెల్లించాలన్నారు.

అర్హతే ప్రామాణికంగా పేదల సంక్షేమం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- వానపల్లిలో గడప గడపకూ..

కొత్తపేట: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కుల, మతాలు, రాజకీయ పార్టీలు చూడకుండా, ఎవరి సిఫారసులు గాని కమిటీల పెత్తనంతో గాని లేకుండా అర్హతే ప్రామాణికంగా తీసుకుని పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని వానపల్లి సచివాలయం-1 పరిధిలో శనివారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబాల వారిని కలిసి అమ్మా బాగున్నారా? ఈ పథకాల లబ్ధి చేకూరింది కదా.. అని ఆయా కుటుంబాలకు వర్తించిన పథకాల జాబితా చూపించారు. ప్రతిగా ఆ లబ్ధిదారులు తమకు వర్తించిన సంక్షేమ పథకాలను ఆనందంగా వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ ఆకాంక్షకు అనుగుణంగా పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని వారికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, పళ్లాలమ్మ దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, రైతు విభాగం సభ్యుడు బండారు దొరబాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు సాక జానకిరామరాజు, గ్రామ పార్టీ నాయకులు దుప్పలపూడి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



వానపల్లిలో లబ్ధిదారులకు పథకాల పత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

కొత్తపేట ఐసీడీఎస్ పరిధిలోకి మండలం విలీనం

ఆలమూరు: ఇప్పటి వరకూ కపిలేశ్వరపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న ఆలమూరు మండలం శనివారం నుంచి కొత్తపేటలో విలీనమైనట్లు సూపర్ వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, బి.వరలక్ష్మి, వై.అరుంధతి తెలిపారు. వారు మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మండలాన్ని విలీనం చేస్తూ ఆదేశాలు జారీ చేసిందన్నారు. కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఇప్పటి వరకూ ఉన్న కొత్తపేట, ఆత్రేయపురం, రావులపాలెం మండలాలతో పాటు ఆలమూరు మండలం విలీనమైందన్నారు. దీంతో ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీల సంఖ్య 209 నుంచి 285కు పెరిగిందన్నారు. కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సీడీపీఓ పి.శారద నేతృత్వంలో మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తాయన్నారు.

వేంకటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేశారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చింతలూరులో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆలమూరు: కలుషిత నీరు, దోమల ద్వారా వ్యాప్తి చెందే టైఫాయిడ్, డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు వహించాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, ఆర్.సుదర్శన్‌బాబు, డి.మల్లికార్జున, డి.సువర్చలానాయుడు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం పర్యటించారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌వీలు పి.ఉమ, సీహెచ్ బేబి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడులు

ఆత్రేయపురం: మండలంలోని మెర్లపాలెంలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1040 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బీవై కిరణ్ తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతుబజార్‌లో తక్కువ ధరకు బియ్యం విక్రయాలు

కొత్తపేట: దేశ వ్యాప్తంగా నిత్యావసరాల ధరలు నింగినంటుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో సామాన్య ప్రజలపై ఆ భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో శనివారం స్థానిక రైతుబజార్‌లో సన్న బియ్యం విక్రయాలు రూ.46 కే చేపట్టారు. ఈ బియ్యం విక్రయాన్ని అముడా చైర్మన్, ఎంపీపీలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో సూపర్ ఫైన్ బియ్యం ధర రూ.65 నుంచి రూ.70 వరకూ ఉందన్నారు. అదే రకం బియ్యాన్ని సామాన్యులకు సైతం అందివ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులను ఇందులో భాగస్వాములను చేస్తూ మార్కెట్ ధరల కంటే 15–20 శాతం తక్కువ ధరకే బియ్యం ఇతర నిత్యావసరాలు విక్రయిస్తుందన్నారు. దానిలో భాగంగా ఈ రైతుబజార్‌లో తొలుతగా సూపర్‌ఫైన్ రకం బియ్యం విక్రయాలు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, జీబీహెచ్ పీఎంసీ చైర్మన్ బీర శ్రీనివాసరావు, బెజవాడ నారాయణరావు, డీటీ ఎన్.శ్రీనివాస్, ఎంఎస్ఓ రమాదేవి, వీఆర్ఓ వీరేంద్ర, ఎం.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



రైతుబజార్‌లో బియ్యం విక్రయాలు ప్రారంభిస్తున్న అముడా చైర్మన్ డేవిడ్‌రాజు, ఎంపీపీ గంగాధరరావు

నిర్మాణంలో అలసత్వం వద్దు



మొసలపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: ప్రభుత్వ నిబంధనల మేరకు అలసత్వం లేకుండా నాణ్యత ప్రమాణాలతో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మొసలపల్లిలో జరుగుతున్న అంగన్‌వాడీ కేంద్ర భవన మరమ్మతులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాడు నేడు పథకంలో రూ.5లక్షలతో అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని మరమతులు చేయిస్తున్నామన్నారు. కేంద్రానికి వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆటపాటలతో పాఠాలు బోధించాలన్నారు. గర్భిణీలకు, బాలింతలకు ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలన్నారు.